




తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక







ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :107 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ బుధవారం 11 ఫిబ్రవరి 2026

# ఆ భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం: జగన్

**-చంద్రబాబు ప్రభుత్వం జీఎస్‌డీపీపై తప్పుడు లెక్కలు చెబుతోందని జగన్ ఆరోపణ**
**-11.75 శాతం వృద్ధి అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శ**
**-'కాగ్' లెక్కల ప్రకారం రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి కేవలం 1.97 శాతం మాత్రమేనని వెల్లడి**
**-పన్నుల వసూళ్ల వృద్ధిలో 23 రాష్ట్రాల్లో ఏపీకి 22వ స్థానం లభించిందని ఎద్దేవా**
**-అప్పులు, అవినీతి, కక్ష సాధింపుల్లోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందని తీవ్ర విమర్శ**

వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025–26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు.



"11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు '22వ ర్యాంక్ విజన్' అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

# బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైలును తిరుపతితో కలపాలి

## ఏపీకి మరో వందేభారత్... కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయవాడ–బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వెళ్లేలా వందేభారత్ రైలును కేటాయించాలని కోరారు.

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏపీని తాకుతూ ప్రకటించడంపై చంద్రబాబు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో, బెంగళూరు–చెన్నై హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా కోరారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రారంభించేలా తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే సరకు రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్‌పీటీ పోర్టుకు అరటిపండ్ల ఎగుమతికి వీలుగా, 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లను కేటాయించాలని కోరారు. అలాగే ఉత్తర–దక్షిణ భారతాలను కలిపే ఇటార్సీ–విజయవాడ ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌కు, ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్–చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని ప్రతిపాదించారు.

రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని పెంచేందుకు కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. హైదరాబాద్–శ్రీశైలం–మార్కాపురం మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ–బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ సర్వీసును నడపాలని చంద్రబాబు కోరారు. విశాఖ–విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ–కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి–చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుప్పంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతో పాటు, అక్కడ రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని కూడా రైల్వే మంత్రిని కోరారు. సీఎం వినతులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

ఢిల్లీలో చంద్రబాబు ఫుల్ బిజీ!

సీఎం చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ ఆయన తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో వేర్వేరుగా భేటీ అయ్యారు.

మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన చంద్రబాబు, రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిని ఆయనకు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాల నిర్వహణకు (వేస్ట్ మేనేజ్‌మెంట్) ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని 'జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్'గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను



ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద రూ. 276 కోట్ల అంచనా వ్యయంతో ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 105 కోట్లను వెంటనే మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) తిరిగి లాభాల బాట పట్టడంపై కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక చేయూత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు, అలాగే స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల అవిరళ కృషితోనే ఇది సాధ్యమైందని కుమారస్వామికి వివరించారు. ప్రస్తుతం వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడమే కాకుండా, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఐఎన్ఎల్ విషయంలో భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం ఇదే రకమైన తోడ్పాటును, సహకారాన్ని కొనసాగించాలని కోరారు. ఈ భేటీల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, సహకారాన్ని సాధించేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.


# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను..

## -స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!

లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు.

ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు.



ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసం ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# విద్యార్థులకు శుభవార్త చెప్పిన మంత్రి నారా లోకేశ్

**-ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం రూ. 1,200 కోట్లు విడుదల**
**-రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అందనున్న తక్షణ ప్రయోజనం**
**-బకాయిలన్నీ చెల్లించి, ఇకపై సకాలంలో సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ**
**-చదువులకు ఎలాంటి ఆటంకాలు ఉండవని మంత్రి నారా లోకేశ్ భరోసా**

ఆంధ్రప్రదేశ్‌లోని లక్షలాది మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం రూ. 1,200 కోట్లను విడుదల చేసినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ప్రకటించారు. తాజాగా బ్యాంకు విడుదల ఉత్తర్వుల (దీ=ాం) ద్వారా ఈ నిధులను తక్షణమే విడుదల చేస్తున్నామని, దీనివల్ల విద్యార్థులకు వెంటనే లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మా హామీ ఒక్కటే. ఇకపై చదువులకు ఎవరికీ ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించి, భవిష్యత్తులో సకాలంలో సాయం అందించడమే మా ప్రభుత్వ స్పష్టమైన నిబద్ధత," అని వివరించారు.

ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. "మీ ప్రభుత్వం మీకు తోడుగా ఉంది, మీరంతా ధైర్యంగా చదువుకోండి" అని



లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ నిధుల విడుదలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# కళ్ళకు గంతులు దేనికి కట్టుకున్నావు గుమ్మనూరు జయరాం

## -మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ భీమయ్య



విజేత మంత్రాలయం:
వైఎస్సార్సీపీ హయాంలో మంత్రి గా పని చేసి పార్టీ ఫిరాయించిన గుమ్మనూరు జయరాం చంద్రబాబు నాయుడు మెప్పు కోసం విమర్శలు చేయడం సరికాదని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాయర దర్శిని హోటల్ లో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి., రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ వీరేష్, వార్డు సభ్యులు రామాంజనేయులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనం కోసం వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ధృతారాష్ట్రుడి మాదిరి కళ్ళకుగంతలు కట్టుకున్నామని మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. మంత్రిగా ఉండి కోట్లు సంపాదించుకున్నది ఎవరు?
కర్ణాటక మద్యం, పేకాట క్లబ్బులు, మట్కా నిర్వహించడం ఇవన్నీ చేసింది ఎవరు?
తమరి అనుచరులా లేదా మీ సోదరులా ఎవరు?
మరి ఆరోజు కూడా మీరు కళ్ళకు గంతలు కట్టుకున్నారా?
జడ్పీటీసీ గా ఉన్న నిన్ను రెండు సార్లు యమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా చేసిన జగన్ కే వెన్నుపోటు పొడిచి, ఈరోజు కళ్ళకు గంతలు కట్టుకున్నాం అంటున్నావా.
కళ్ళకు గంతులు కట్టుకున్నది అప్పుడు కాదు ఈ ప్రభుత్వం లో కట్టుకున్నావు, ఎందుకంటే కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సమర్తిస్తూ, ప్రభుత్వం భక్తుల మనోభావాలు దెబ్బ తీసేవిదంగా ప్రవర్తిస్తుంటే ఇప్పుడు కళ్ళు మూసుకొని గత ప్రభుత్వం గురించి మాట్లాడుతున్నావు. అది నీ విజ్ఞతకే వదిలేస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, కురువ మల్లికార్జున, శివ కుమార్, వీకేసి రఘు, అల్లింగప్ప, జిమ్మి, గాలెప్ప తదితరులు ఉన్నారు.

# చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి"

## -సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ బి.శ్రీనివాసరావు -ముగిసిన రాష్ట్ర స్థాయి టీచర్ల లీప్ క్రికెట్ టోర్నమెంట్





విజేత గన్నవరం క్రీడా ప్రతినిధి:
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడానికి విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ బి.శ్రీనివాసరావు అన్నారు.
మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీలో ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లీప్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎస్పీడీ గారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమగ్ర వికాసానికి, విద్యార్థుల భవిష్యత్తు కోసం క్రీడా పోటీలు నిర్వహించి విద్యాశాఖ నూతన ఒరవడి సృష్టించిందని, ప్రతి ఏటా ఈ సంస్కృతి కొనసాగించాలని అన్నారు. మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన ఈ క్రీడా సంబరాల్లో దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొనడం విశేషం అని అన్నారు. చదువు అంటే కేవలం పుస్తక పఠనం మాత్రమే కాదు, ఆటపాటలు కూడా అందులో అంతర్భాగమేనని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. ఉపాధ్యాయులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించాలని, పాఠశాలలకు అందించిన స్పోర్ట్స్ కిట్లను వినియోగించాలని అన్నారు. క్రీడల ద్వారా టీమ్ బిల్డింగ్(జట్టు), నాయకత్వ లక్షణాలు, ఓటమిని తట్టుకునే మానసిక ధైర్యం లభిస్తుంది. ప్రస్తుతం విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడిని, ఆత్మహత్యల ధోరణిని నివారించడానికి ఆటలు ఎంతో దోహదపడతాయి. ఈ దిశగా ఇప్పటికే 255 మంది కౌన్సిలర్లను నియమించామని, త్వరలోనే మరో 400 మందిని నియమించబోతున్నామని ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు వెల్లడించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విశాలమైన ప్లే గ్రౌండ్‌లు, క్రీడా సామగ్రి వంటి వసతులు ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుంటూ, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని, తల్లిదండ్రులలో నమ్మకాన్ని కలిగించాలని పిలుపునిచ్చారు.
క్రికెట్ విజేతలు వీరే:
ఈ టోర్నమెంట్ లో ఛాంపియన్ గా శ్రీ సత్యసాయి జిల్లా మొదటి స్థానం దక్కించుకోగా, రన్నర్ గా అనకాపల్లి జిల్లా, మూడో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లాలు నిలిచాయి. విజేతలకు ఎస్పీడీ గారు ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ శ్రీ కె.రవీంద్రనాథ్ రెడ్డి గారు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీ జి.భానుమూర్తి రాజు గారు, ఎంఐఎస్ సూపరింటెండెంట్ భుజంగరావు గారు తదితరులు పాల్గొన్నారు.

# బలుసులమ్మ వైభవాన్ని చాటి చెబుదాం

## -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
అనితర సాధ్యమైన విధంగా జాతర నిర్వహించి శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ వారి వైభవం నలుదిశలా చాటిచెబుదామని శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బలుసులమ్మ వారి జాతర కరపత్రాన్ని,గోడ పత్రికను మంగళవారం ఆవిష్కరించారు.స్థానిక బలుసులమ్మ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరు ఈ జాతరకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరి సౌభాగ్యం కోసం చేస్తున్న ఈ జాతర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో జరిగే వివాహ కార్యక్రమాలుగా భావించి సహకరించాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్,వస్త్ర వ్యాపారుల సంఘం, బులియన్,మెడికల్, విద్యాసంస్థలు తదితర సంఘాలు, సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. జాతర సందర్భంగా మార్చి 27న జరిగే భారీ అన్న సమారాధనకు కూరగాయలను అందజేస్తామని విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం తరఫున పెచ్చెట్టి సత్తిబాబు ప్రకటించారు.ఎరువుల వ్యాపారి తుంపూడి శ్రీనివాసరావు తమ కుమార్తె వివాహ సందర్భంగా అమ్మవారికి రూ.50,000, బిజెపి పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ రూ.50,000, తాసిల్దార్ రాజరాజేశ్వరి 10 వేల రూపాయలు, దాగారపు శ్రీనివాస్ రూ.25,000, టి.ఎన్. ఆర్.మెరైన్స్ రూ.10,000 విరాళాలను ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్




ఏసుబాబు ఎమ్మార్వో రాజరాజేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు వర్తనపల్లి కాశి, అడప ప్రసాద్, పట్నాల రాంపండు, దువ్వ శ్రీను, మద్దాల మణికుమార్, సత్తి జగన్మోహన్రావు, నీలపాల దినేష్ యాదవ్, రామ లక్ష్మణ్, అడ్డగర్ల సూరి, గట్టెం నాని, అయినం బాలకృష్ణ,బైలపాల ముఖేష్, వీర మహిళలు,కూటమి నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లు పరిశీలన

### భక్తులు సంయమనం పాటిస్తూ దర్శనం చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి...

### ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు భక్తులు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలి...

విజేత,శ్రీశైలం :
జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం కొరకై దేశం నలుమూలల నుండి భక్తులు విచ్చేయుచున్న సందర్భంగా శ్రీశైల క్షేత్రం భక్తులతో రద్దీగా ఉండడం జరుగుతుంది. ఈ సందర్భంగా భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని శ్రీశైల క్షేత్రం నందు బందోబస్తు ఏర్పాట్లను లికర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ ఐపీఎస్ తో పాటు నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా గుడి పరిసర ప్రాంతాలు, గుడి బయట ఏర్పాటుచేసిన క్యూలైన్లు మొదలుకొని స్వామి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమించే మార్గం వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను మరియు శివ స్వాములు వేచి ఉండే చంద్రావతి కళ్యాణమండపం మరియు ప్రత్యేకంగా వారికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలలో స్వయంగా పర్యటించడంతోపాటు సిసి కెమెరాల ద్వారా భక్తుల రద్దీని వారి భక్తుల భద్రత ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది.అనంతరం భద్రత దృశ్య ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాలని గుడి ప్రవేశ మరియు నిష్క్రమణ ప్రాంతాలలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను డీఎఫ్ఎండి ఏర్పాటు చేసుకోవాలని, విధినిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని,ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి అధికారులకు పలు సూచనలు చేయడం జరిగింది.శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం విచ్చేయు భక్తులు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పోలీసు వారి సూచనలు పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని రోడ్డుకిరువైపులా వాహనాలను నిలుపు రాదని విజ్ఞప్తి చేయడం జరిగింది.



# మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి హుండీ లెక్కింపు



విజేత మంత్రాలయం:
మంత్రాలయం మండల కేంద్రంలో శ్రీ పుణ్యక్షేత్రం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠము. నందు. శ్రీ శ్రీ స్వామీజీ ఆదేశాల మేరకు శ్రీ మఠం మేనేజర్ ఎస్ కే శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో 21 రోజులకు గాని హుండీ లెక్కించడం జరిగింది... కరెన్సీ
2.98,13,571/-.. కాయిన్స్..10,24,000/-
.అమౌంట్ మొత్తం 3,08,37,571/-
..గోల్డ్ 13 గ్రాములు
.. సిల్వర్ 10 18 గ్రామ్స్.... ఈ విధంగా లెక్కించడం జరిగింది. మఠం మేనేజర్ ఎస్. కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించడం పూర్తి ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది...

# బాధితుడిని పరామర్శించిన వడ్డి



విజేత, ,(తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డీ రఘురామ్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని జగ్గంపేటలో బొల్లం సుబ్బరాజుకు చెందిన పశువులపాక, గడ్డివాము అది ప్రమాదంలో అహుతయ్యాయి. విషయం తెలుసుకున్న రఘురామ్ నాయుడు ఘటన ప్రాంతాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. సుబ్బరాజు ఓదార్చి దక్షిణ సహాయంగా 10,000 రూపాయలు అందజేశారు.

# మన బడిని మనం కాపాడుకుందాం

## -యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్ మనోహర్.




విజేత నల్లజర్ల
యుటిఎఫ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం ఊరి బడిని కాపాడుకుందాం యొక్క పోస్టర్ను నల్లజర్ల మండల విద్యాశాఖ అధికారి వై. సత్యనారాయణ, ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం కార్యక్రమం అభినందనీయమని ఈ కార్యక్రమంలో అందరూ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్యను అత్యధికంగా పెంచాలని కోరారు ఈ కార్యక్రమంలో నల్లజర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కోమలి చిత్ర యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్ మనోహర్ కుమార్, నల్లజర్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి కిషోర్, ఎస్ఎఫ్ ఆలీ అహ్మద్ నల్లజర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నియోజవర్గంలో జనసేనకు షాక్

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: జనసేన కు పెద్ద షాక్ కలిగింది. మండలంలోని మారంపల్లికి చెందిన 25 మంది జనసేన, తెలుగుదేశం కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి వడ్డీ రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో మారంపల్లి జనసేన పార్టీ అధ్యక్షుడు మంగిన బాలాజీ తన అనుచరులతో కలిసి వైస్సార్సీపీలో చేరారు. వీరికి రఘురామ్ నాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ ఆశయాలు నచ్చి తాను పార్టీలో చేరినట్లు బాలు చెప్పారు. రఘురామ్ నాయుడు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం శు భసూచికమన్నారు. కార్యక్రమంలో మిద్దె శివ, మేక సాయి, కరీంకి దుర్గాప్రసాద్, కనపర్తి సురేష్, వెంకన్న , ఆదిరెడ్డి దుర్గారావు, పసలపూడి నాగేశ్వరరావు, సుంకర చంద్రశేఖర్, కొండపల్లి కనకం, ఇందుకూరి శ్రీనివాసరాజు, సారిక సత్యనారాయణ, ఉత్తరవల్లి నాగు, నందమూరి మాజీ సర్పంచ్ దానయ్య పాల్గొన్నారు.

## సలికినీడి ఎసమ్మకు నివాళులు అర్పించిన తెలుగుదేశం పార్టీ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగ శ్రీనివాసరరావు జంపని వెంకటేశ్వరరావు, పెడవల్లి రామయ్య



విజేత గణపవరంఅంబేద్కర్ కాలనీ
నాదెండ్ల మండలం గణపవరం గ్రామం లోని అంబేద్కర్ కాలనీ వాస్తవ్యులు, సలికినేడి శేషయ్య భార్య సలికి నీడి ఎ సుమ్మ గుండె సంబంధ (గుండె పోటు) సమస్యతో బాధపడుతూ కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఇంత చిన్న వయసులో కోల్పోవడం చాలా బాధాకరమని తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసి, ఈ బాధ నుండి కోలుకునేలా భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని అందించాలని కోరిన తెలుగుదేశం పార్టీ నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు జంపని వెంకటేశ్వరరావు ,పెడవల్లి రామయ్య ఈ కార్యక్రమంలో వారివెంట పెనుమలరుద్రయ్య, పెనుమల,బాబు తదితరులున్నారు.

# ఏళ్ల తరబడి ప్రజలను వేధిస్తున్న మంచినీటి సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం

**పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**



విజేత పోలవరం
మంగళవారం కొయ్యలగూడెం మండలంలోని రామనుజపురం గ్రామంలో రూ.33 లక్షల వ్యయంతో,
వేదాంతపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో,
సరిపెల్లి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో
నిర్మించనున్న నూతన మంచినీటి ట్యాంకుల పనులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ప్రజల మౌలిక హక్కు అని, గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అనేక గ్రామాలు సంవత్సరాలుగా నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను ప్రాధాన్యతగా తీసుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ప్రతి గ్రామానికి తగిన వసతులతో మంచినీటి ట్యాంకులు నిర్మించి, ఇంటింటికీ సురక్షితమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రానున్న రోజుల్లో పోలవరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలోమాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు,జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్,జనసేన మండల ప్రెసిడెంట్ తోట రవి,కోయిలగూడెం టిడిపి మండల ప్రెసిడెంట్, మాజీ ఏఎంసీ చైర్మన్ పారెపల్లి రామారావు,ఎంపీటీసీ పామిశెట్టి మధు, రాజేష్,చింతల వెంకటరమణ, అడప శ్రీను, గ్యాలం భాస్కరరావు,వామశెట్టి సత్యనారాయణ, అనంత శ్రీను, దాసరి గంగరాజు,టౌన్ ప్రెసిడెంట్ మాదేపల్లి శ్రీనివాస్,దాసరి వినోద్, జక్కు శ్రీను, రత్నకుమార్, నల్లమోను శ్రీను,మందపాటి వెంకటేశ్వరరావు, నులకని శ్రీను,మన్నిడి సాయిబాబా, చోడి పిండి సుబ్రహ్మణ్యంమరియు ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

## -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విజేత (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
ప్రజలు తమ ఇంటితోపాటు చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మెప్మా రిసోర్స్ పర్సన్ లకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటిని శుభ్రం చేసుకుని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయటం కాకుండా ఇంటి చుట్టుపక్కల పరిసరాలను కూడా కాలుష్యరహితంగా, పరిశుభ్రంగా ఉండే విధంగా శ్రద్ధ వహించాలన్నారు.



ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా కాటన్ సంచులను వాడటం అలవాటు చేసుకోవాలని, గూడెం మీదుగా ప్రవహిస్తున్న గోదావరి కాలువను కలుషితం కాకుండా కాపాడుకోవాలని అన్నారు. పట్టణంలోని మురుగునీరు కాలువలో కలవకుండా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో తాను చైర్మన్ గా ఉన్న సమయంలో కంపోస్ట్ యార్డుకు 10 ఎకరాలు,విద్యుత్ ప్లాంట్ కు 5 ఎకరాలు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వం ఆ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మించి బాధ్యతారహితంగా వ్యవహరించిందని విమర్శించారు. పురపాలక సంఘం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే ప్రభుత్వ సర్వేలో మంచి రేటింగ్ వస్తుందని తద్వారా అధిక నిధులు మంజూరు అవుతాయన్నారు.ఈ విషయంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని కాలుష్యరహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో పని చేస్తుందని అన్నారు. పురపాలక సంఘానికి మరిన్ని ఉత్తమ సేవా అవార్డులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, గుండుమోగుల పద్మప్రియ పాల్గొన్నారు.



# సైకిల్ ఉచితంగా అందజేసిన పాస్టర్ ప్రవీణ్ పాల్

విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి:మండలంలోని తిరుమాలి గ్రామానికి చెందిన మిరాకిల్ మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్, మిరాకిల్ మినిస్ట్రీస్ అండ్ సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పి ప్రవీణ్ పాల్ సైకిల్ ను సంజీవ్ కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పాల్ మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామానికి చెందిన పాస్టర్ సీమోను మనవడు సంజీవ్ నాకు చదువుకోడానికి ఒక సైకిల్ కొనివ్వమని అడగగా, ఆయన వెంటనే స్పందించి తిరుమాలి చర్చిలో సైకిల్ను ఉచితంగా బహుమతి ప్రధానం చేయడం జరిగింది అన్నారు

# వెట్టి విమోచన చట్టం అమలుకు 50 సంవత్సరాలు పూర్తి

విజేత దేవరపల్లి
వెట్టి విమోచన చట్టం అమలకు 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్‌ను తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ కీర్తి చెకూరి , జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ , రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా చేతుల మీదుగా జరిగింది.
ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా వెట్టి విమోచన కోయిలేషన్ కన్వీనర్ విజయనిర్మల , కో-కన్వీనర్ ఆంజనేయులు పాల్గొని కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. వెట్టి విమోచన చట్టం స్వర్ణోత్సవం సందర్భంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఈ పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనలో వెట్టి విమోచన చట్టం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సమాజంలో ఎక్కడైనా ఇటువంటి వ్యవస్థ కొనసాగకుండా అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు రక్షణ మరియు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.జిల్లాలో ప్రజల్లో చట్టంపై అవగాహన



పెంపొందించేందుకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో, వెట్టి విమోచన కోయిలేషన్ సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

# శ్రీశైలం ఆలయంలో శివస్వాములకు లాఠీ దెబ్బలు

విజేత,శ్రీశైలం:
శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు అపశృతి చోటుచేసుకుంది దూర ప్రాంతాల నుంచి వేలాదిమంది శివ స్వాములు,భక్తులు కాలినడకన శ్రీశైల మల్లన్న దర్శించుకోవాలనే ఆశతో వస్తుంటారు.శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకునే సమయంలో శివ స్వాములు,భక్తులు చంద్రావతి కళ్యాణ మండపం మరియు క్యూలైన్లలో గంటల తరబడి ఆహారం, నీరు,సరైన సౌకర్యాలు లేకపోవటంతో గేట్ల తాళాలు పగలగొట్టి బయటకు వచ్చిన భక్తులు.నిర్వహణ సరిగ్గా లేక దర్శనానికి పరుగులు పెట్టిన భక్తులు అక్కడ ఉన్న పోలీస్ భక్తులపై లాఠీఛార్జ్ చేయటంతో ఈవో డోమ్ డోమ్ అంటూ భక్తులు నిరసన వ్యక్తం చేశారు. సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడం దరిద్రమని దేవస్థానం సిబ్బంది పాలకులపై భక్తులు మండిపడ్డారు.
శివస్వాములపై లాఠీ ఛార్జ్ చేసిన పోలీసు పై దేవదాయ శాఖ తగు చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.





# అమ్మవారి జాతరకు సహకరించాలి

## -దాతలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి

విజేత , (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
పట్టణ ప్రజల ఆరాధ్య దేవత శ్రీ బలుసులమ్మ వారి జాతర మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక శ్రీ బలుసులమ్మ వారి కళ్యాణ మండపంలో నిర్వహించిన వివిధ ధార్మిక, స్వచ్ఛంద సేవ సంస్థలు,రాజకీయ పార్టీలు, సేవా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న ఈ జాతర మహోత్సవానికి వ్యయం అవుతుందన్నారు. భక్తులు,వివిధ సంస్థల ప్రతినిధులు, వ్యాపార సంస్థలు యజమానులు, వివిధ సంఘాల వారు భూరి విరాళాలు ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అమ్మవారి జాతర నిమిత్తం 50 వేల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీరంగం అంజిబాబుకు అందజేశారు. వివిధ ధార్మిక ఆధ్యాత్మిక సంస్థలు, వ్యాపార విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఎన్ డి ఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన

విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి :పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు
కమాండంట్ వి వి ఎన్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో విజయవాడ 10వ బెటాలియన్ ఎన్డిఆర్ఎఫ్ పర్యవేక్షణలో ఏలేరు నదీఅప్పన్న వంతెన వద్ద మత్స్యకారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది వరదలు, వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటర్ రెక్యూ, నీటిలో మునిగే వారిని ఎలా రక్షించాలి అనే వాటిపై, అవగాహన కల్పించారు.నీటిలో



మునగ కుండ ఇంప్రూవైజ్డ్ డివైసెస్ ఎలా చేసుకోవాలి.తర్వాత సిపిఆర్ ఎలా అమలు చెయ్యాలి అనే వాటిపై విపులంగా వివరించారు. విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా బృందం తాసిల్దార్ కుశరాజు, మండల మత్స్య శాఖ అధికారి రాజేంద్ర,ఆర్ ఐ పొన్నాలు, వి ఆర్ ఓ కిషోర్, ఆరోగ్య సిబ్బంది, పలువురు మత్స్యకార సంఘాల సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# ధార్మిక మహాసభలను విజయవంతం చేయండి

## -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో
శాంతి, సోదరభావం ఆధ్యాత్మి క ఉన్నతే లక్ష్యంగా నిర్వహిస్తు న్న ఇస్లామియా ధార్మిక మహాసభలను ప్రజలు విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఇస్లామియా ధార్మిక మహాసభల పోస్టర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ కె గ్రౌండ్ లో నిర్వహించే సభలకు హాజరయ్యే



భక్తులకు, అతిథులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సర్వమత సౌభాతృత్వంతో అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరా రు. ధార్మిక చింతన మనిషిని సరైన మార్గంలో నడిపిస్తుందని ఇటువంటి మహాసభలు సమాజంలో శాంతిని, సామరస్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయనీ అన్నారు. కార్యక్రమంలో షేక్ బాజీ,కాజా రహంతుల్లా, షేక్ షంషుద్దీన్, అంబటి వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

**- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, ఎస్సై వెంకటేశ్వరరావు :**

విజేత గణపవరం
ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై ఆర్.వెంకటేశ్వరావు అన్నారు. గుంటూరు – కర్నూలు రహదారిపై మండలంలోని పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అన్నారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలి అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే తల్లిదండ్రులను బాధ్యులు చేసి చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆటోలు నడిపేవారు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆటో నడపాలి అన్నారు. మితి మీరిన వేగంతో ఆటో నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు అన్నారు. ఇటీవల కాలంలో ఆటో డ్రైవర్లు ఇటీవల కాలంలో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలను పరిమితికి మించి ఆటోలపై ఎక్కిస్తున్నారు అన్నారు. పరిమితికి మించి కూలీల ఎక్కించి కోరి ప్రమాదాలు తెచ్చుకోరాదు అన్నారు.



అక్షర విజేత



# వైసిపి అరాచకాలను ప్రజల కు వివరించండి

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
రాష్ట్రంలో చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను, రౌడీయిజాన్ని ప్రజలకు వివరించాలని శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను కోరారు. తాడేపల్లిగూడెం మండలం, పడాలలో రక్షిత మంచినీటి పథకానికి మంగళవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురదజల్లే కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రిని దుర్భాషలాడిన మాజీ మంత్రి అంబటి రాంబాబును సమర్థించడం వైసిపి అరాచక వైఖరిని తెలియజేస్తుంద న్నారు. వైసిపి తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతు పండించిన ధాన్యం అమ్ముకునే అవకాశం లేక అష్ట కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతు పండించిన ధాన్యానికి కొనుగోలు చేసిన 24 గంటల్లోపు నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టిందని, ఆక్వా రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. తాము చేసే అరాచకాలను సమర్ధించు కోవటమే కాకుండా, కులమతాలను రెచ్చగొట్టే విధంగా వైసిపి ప్రవర్తించడం దారుణమన్నారు. రాబందుల రాజ్యం మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు. ప్రజలంతా ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి ప్రసాదాన్ని కల్తీ చేసి తిరిగి దబాయించడం ప్రజలు గమనించారన్నారు. శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలు చర్చించలేని అసమర్థులైన వైసీపీ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను విమర్శించే అర్హత లేదన్నారు. పోలవరం,అమరావతి తదితర బృహత్తర నిర్మాణాలను కూటమి ప్రభుత్వం త్వరలోనే పూర్తి చేస్తుందన్నారు. రాష్ట్రంలో పూర్తిగా ధ్వంస మయిన రోడ్లను తిరిగి నిర్మిస్తున్నా మన్నారు.పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 13,300 గ్రామాలకు మహర్దశ వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించాలని ఆయన కూటమి శ్రేణులను కోరారు. కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ చాపల మంగా భాయ్,అడపా ప్రసాద్, కట్టుబోయిన వెంకటలక్ష్మి, పాలూరి వెంకటేశ్వరరావు, పైబోయిన వెంకటరామయ్య, వాడపల్లి సుబ్బరాజు, రామ లక్ష్మణ్, మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా జాతర



## అధికారులకు ఎమ్మెల్యే బొలిశెట్టి ఆదేశం

విజేత, (తాడేపల్లిగూడెం)
పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
పట్టణ గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులతో జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ ఏసుబాబు అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అమ్మవారి జాతర పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మార్చి 12 నుండి 27 వరకు జరుగుతాయని ఈ ఉత్సవాలకు సంబంధించి ప్రతి శాఖ అధికారులు ఉద్యోగులు నిబద్ధతగా పనిచేయాలని వారిని ఆదేశించారు. గతంలో తను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉండగా 2014 లో జాతర మహోత్సవాలు జరిగాయని తిరిగి తాను ఎమ్మెల్యే అయిన తరువాత ఈ సంవత్సరంలో జాతర మహోత్సవాలు నిర్వహించడం అమ్మ దయా అని అన్నారు. ఈ జాతర అత్యంత వైభవంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఇదే సందర్భంలో జాతరకు స్థానికంగా ఉన్న మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది సరిపోకపోతే జిల్లా స్థాయి నుంచి పోలీస్ సిబ్బందిని తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. జాతర విషయమై కలెక్టర్ కి ,జిల్లా ఎస్పీ కు కొన్ని ప్రత్యేక అనుమతుల కొరకు లేఖలను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. అదే విధంగా జాతర ప్రారంభించే సమయానికే రహదారులను పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులును కోరారు . అగ్నిమాపక శాఖ, వైద్య సిబ్బంది, రెవిన్యూ, పురపాలక శాఖ అన్ని శాఖల వారు సమన్వయంతో జాతరలో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా సహకరించాలన్నారు. శాఖపరమైన ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ దేవత జాతర అంటే తాడేపల్లిగూడెం లో ప్రతి గడప లో జరిగే పెద్ద పండుగని అన్నారు . ప్రతి కుటుంబం వారి ఆడపడుచులతో పాటు దేశ విదేశాలలోని బంధువులు జాతర సమయంలో వస్తారని మనం ఊహించిన దానికంటే జనం ఎక్కువగా ఉంటారని దానికి అనుగుణంగానే అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అదేవిధంగా అన్ని వర్గాల ప్రజలు కులమతాలు కతీతంగా జరుపుకునే అమ్మవారి జాతరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్థిక ఇబ్బంది లేని వారు ఎవరైనా ఈ జాతర మహోత్సవం ఘనంగా జరిగే విధంగా ఆర్థిక సహాయ సహకారాలు అందించవచ్చ న్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలను విద్యుత్ వెలుగులతో సుందరీక కరణ చేస్తున్నామని జాతర సమయంలో అమ్మవారికి చేసే పూజా కార్యక్రమాలు మైక్ సెట్ ల ద్వారా అన్ని ప్రాంతాల వారు వినే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జాతర కాలమంతా నిత్య అన్నదానం చేసే విధంగా అమ్మవారి ఖాతాలోకి కొంత సొమ్మును జమ చేశామన్నారు. ఆలయ కమిటీ లో సభ్యులుగా పట్టణం నుండే కాకుండా పల్లెల నుండి కూడా కొంతమందిని సభ్యులుగా చేర్చామన్నారు. అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరగాలని మనకు మన పట్టణానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, తాసిల్దార్ రాజరాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ కార్యాలయం అనురాధ, బలుసులమ్మ ఆలయ ఈవో చంద్రశేఖర్ వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# భక్తులకు సౌకర్యాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

### -ముందస్తు ప్రణాళిక లు లేకపోవడంతో నే భక్తుల పై దాడి....

### -ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వసతులు కల్పించాలి

### -మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

విజేత మంత్రాలయం:
శ్రీశైలం లో భక్తులకు సౌకర్యాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి.. అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన మీడియాతో ఫోన్లో మాట్లాడుతూ శివరాత్రి పండుగ ను పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శివ మాల ధరించి ఇరుముడితో వస్తూంటారు. వీరికి అవసరమైన సౌకర్యాలను కల్పించండంలో అధికారులు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో భక్తుల అధిక సంఖ్యలో తరలి రావడంతో రద్దీ పెరిగి పోయింది. దీంతో గంటల తరబడి క్యూ లైన్లో నిలిచి ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో కొంత మంది శివ స్వాములు బారి కేడ్లు తొలగించి బయటకు రావడం తో సహనం కొల్పోయిన పోలీసులు ఏకంగా లాఠీఛార్జి చేయడం చాలా దారుణమన్నారు. ఫారెస్టు అధికారులు, దేవస్థానం అధికారులు ముందుగానే చర్చించి 1వ తేది నుంచి శివ స్వాములకు అనుమతి ఇచ్చింటే ఈ ఇబ్బందులు వచ్చేవి కాదని మండిపడ్డారు. ఇటీవల ఎమ్మిగనూరు మండలం కల్లుగోట్ల గ్రామంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం లడ్డులో కూడా కల్తీ నెయ్యి కలిపారని మాట్లాడటం పద్ధతి కాదు. ఎలాంటి ఆధారాలు లేకుండా భక్తుల మనో భావాలను దెబ్బ తీసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గు చేట్టన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదే విధంగా టీటీడీ తరహా లో క్యూ లైన్లో ఉండే భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసి, క్యూ లైన్లలకు అనుగుణంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా భక్తులు స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లడ్డు, ప్రసాదం విషయాల్లో కూటమి నాయకులు



వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

# నారా లోకేష్ తో ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ మర్యాదపూర్వక భేటీ



– నెల్లిమర్ల:. నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు తీసుకెళ్లడంతో పాటు, భోగాపురం ముంజేరు గ్రామాల రైతులు భూముల సమస్యలపై ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, రైతుల తరపున తక్షణ పరిష్కారం కోసం విజ్ఞప్తి చేశారు రైతుల సంక్షేమం పట్ల ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో స్పందించే మంత్రి నారా లోకేష్ , సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


# ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి



– పూసపాటిరేగ: 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బి. పాపినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్య హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలలో బలహీన వర్గాల వారికి 25% సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ విద్యా సంవత్సరానికి గాను బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ లోగ సమీప గ్రామ సచివాలయంలో గాని, మీ సేవ కార్యాలయంలో గాని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థి దరఖాస్తు చేసే సమయంలో చిరునామా ధ్రువీకరణకు ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డుతో పాటు వయస్సు ధృవీకరణ పత్రంను తీసుకువెళ్లాలని తెలియజేశారు. సంబంధిత విషయాలపై నివృత్తి కోసం మండల విద్యాశాఖ కార్యాలయమును సంప్రదించవచ్చని ఎంఈఓ తెలియజేశారు.

# నిర్ణీత గడువులోగా ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి చెయ్యండి

### - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



– విజయనగరం:
జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తారకరామ తీర్ధసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, కొత్తవలస– విజయనగరం నాలుగో రైల్వేలైన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకొని వారంలో చేయవలసిన పనులకు లక్ష్యాలు నిర్ణయించారు. ప్రతీ ప్రాజెక్టుకు భూసేకరణ దశలను పూర్తి చేయడానికి నిర్ణీత గడువు విధించారు. అలాగే భోగాపురం ఎయిర్ పోర్ట్ రహదారి, ఎస్టీపీలు, ఎంఎస్ఎంఈ పార్కులకు భూ సేకరణ, మామహామాయ పరిశ్రమ విస్తరణ తదితర అంశాలపైనా ఆరా తీశారు. వీటన్నిటికీ భూసేకరణ త్వరగా పూర్తి చేసి, సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సేకరణ పూర్తయిన వాటికి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. అవార్డ్ కు సిద్ధంగా ఉన్నవాటికి అవార్డ్స్ పాస్ చేయాలన్నారు. భూసేకరణ పనులన్నింటికి ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ ఇ.మురళి, ఆర్డిఓ డి.కీర్తి, ఎస్డిసిలు కళావతి, ప్రమీలాగాంధి, ఆర్ అండ్ బి ఈ ఈ, ఇరిగేషన్, జాతీయ రహదారులు, రైల్వే అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఎల్ఏ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.

# గృహనిర్మాణాన్ని వేగవంతం చెయ్యండి

### - జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

– విజయనగరం :
జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గృహ నిర్మాణ ప్రగతిపై ఆయన కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రగతిని పరిశీలించారు. ఈ రెండు వారాల్లో గ్రామీణ ప్రాంతంలో సుమారు 1374, పట్టణ ప్రాంతాల్లో 650 ఇల్లు స్టేజ్ కన్వర్షన్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికి, పెద్దగా ప్రగతి కనిపించలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీనిపై మండల ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా లబ్ధిదారులను చైతన్య పరిచి, వారు గృహ నిర్మాణానికి ముందుకు వచ్చేటట్టు చేయాలని సూచించారు. అప్పుడు మాత్రమే లక్ష్యాలను సాధించగలరని స్పష్టం చేశారు. కొన్ని సచివాలయాల పరిధిలో సున్నా ప్రగతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కార్యదర్శులు దీనికి బాధ్యత వహించాలని, నిర్మాణాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, గృహ నిర్మాణ ఏఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లతో ప్రత్యేక మాట్లాడి, ప్రగతి ముందుకు నడిచేలా చూడాలని కోరారు. ప్రధానంగా స్టేజ్ కన్వర్షన్ పై దృష్టి పెట్టాలని, తద్వారా నిర్మాణం ముందుకు సాగుతుందని చెప్పారు. సచివాలయం పరిధిలో వారానికి కనీసం రెండు ఇల్లు అయినా స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూసి, ఇల్లు పూర్తి చేసేందుకు కృషి చేయాలనీ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కేంద్రం నుంచి గృహనిర్మాణ శాఖ పిడి మురళీమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

